క్లుప్తంగా

శాస్త్రోక్తంగా సహస్ర్రదీపాలంకరణ



బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి సోమవారం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తిని ఉంచి పూజలు చేపట్టారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో పుష్యమాసం ఆరుద్రనక్షత్రం, పౌర్ణమి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేసి మహామంగళహారతులు ఇచ్చారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: టంగుటూరు గ్రామంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి ఇదే గ్రామానికి చెందిన చింతల సుదర్శన్‌రెడ్డి, ఉదయశ్రీ దంపతులు రూ.25 వేల విరాళాన్ని అందజేసినట్లు సంస్థ నిర్వాహకుడు రామగంగిరెడ్డి తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపి తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు చెన్నకేశవస్వామి ఊరేగింపు



బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామస్తులు ఆరాధ్య దైవంగా కొలిచే చెన్నకేశవస్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం నుంచి స్వామివారి ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల మీదుగా మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించనున్నామని చెప్పారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా అలంకరించినట్లు పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఆలయ ఈఓకు విరాళం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బనగానపల్లె మండలం ఇల్లూరి కొత్తపేటకు చెందిన సొప్ప మద్దిలేటి కుటుంబ సభ్యులు రూ.20 వేల విరాళాన్ని ఆలయ ఈఓ రామాంజనేయులుకు అందజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

కల్యాణ వైభోగం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

డోన్: ధనుర్మాసం ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక వేంకటేశ్వర ఆలయంలో శ్రీదేవి, గోదాదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, అశేష భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రామశర్మ, ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి, శ్రీనివాసరావ్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

- ఘనంగా భోగి వేడుకలు
- ఇళ్ల ముంగిట ఆకట్టుకున్న రంగవల్లులు
- బంధుమిత్రులతో పల్లెల్లో సందడి వాతావరణం

డోన్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా నియోజకవర్గంలో సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేశారు. రంగవల్లులు వేసి ఆవు పేడతో గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల లబ్ధి అందకపోవడంతో పేదలు గతంలోలా పండుగ జరుపుకోలేని పరిస్థితి నెలకొంది. పల్లెల్లో మునుపటి ఉత్సాహం కనిపించలేదు.

మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో..

మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీలు, విభిన్న మతాలు, కులాలకు చెందిన స్నేహితులు కుటుంబాలతో పాల్గొన్నారు. భోగి మంటలు వేసుకుని నువ్వులతో కూడిన సద్దరొట్టె, పిండివంటలు ఆరగించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు రామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన యువతులు, మహిళాలు పండు ఉట్టిపడేలా ముగ్గులు వేసి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేయనున్నట్లు ఆలయ అర్చకుడు భాస్కరయ్య తెలిపారు.

భాగ్యాలనిచ్చే భోగి

కొలిమిగుండ్ల: సంక్రాంతి సంబరాల్లో సోమవారం భోగి పండుగ కావడంతో పల్లెల్లో తెల్లవారుజామునే మహిళలు ఇళ్ల ముంగిట అందమైన రంగు వల్లులు వేశారు. ఇళ్ల ముంగిట, వీధుల్లో చాలా చోట్ల కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేసుకున్నారు.

ఘనంగా భోగి వేడుకలు

కోవెలకుంట్ల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని గ్రామాల్లో సోమవారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ మహిళలు ఇళ్ల ముందు రంగు రంగులతో ముగ్గులు, భోగి మంటలతో వేడుకలను జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల కబుర్లు, కాలక్షేపాలతో పండుగ సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మకర సంక్రాంతికి ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.



కోవెలకుంట్లలో భోగిమంటలు



డోన్: భోగి వేడుకల్లో మహిళలు



తొల్లమడుగులో భోగి మంటలు వేస్తున్న కుటుంబ సభ్యులు



డోన్: ఇందిరానగర్‌లో సంక్రాంతిని ప్రతిబింబించే రంగవల్లి



పలుకూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు



సంక్రాంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్, తదితరులు



ఆకట్టుకుంటున్న సంక్రాంతి ముగ్గు



బేతంచెర్ల: బుగ్గానిపల్లె తండాలో భోగి మంటలు

భోగి వేడుకలు

బేతంచెర్ల: మండలంలో సోమవారం భోగి వేడుకలు అంబరాన్నంటాయి. వేకువజామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. రంగురంగుల ముగ్గులు వేశారు. చిన్నారులకు భోగి పల్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం పిండివంటలు ఆరగించారు. సిమెంట్‌నగర్ కోదండరామాలయం, సుంకులా పరమేశ్వరి, గొరిపేటలో వెలసిన చెన్నకేశవ, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పండుగలు.. సంస్కృతికి చిహ్నాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్: పండుగలు.. మన దేశ సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సంక్రాంతి పర్వదినం తెలుగువారికి ఎంతో ముఖ్యమైన పండుగ అని తెలిపారు. రైతులకు పంటలు ఇంటికి వచ్చే సమయం అన్నారు. ఇంటి ముంగిట గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, పిండి వంటలు తదితర వాటి గురించి వివరించారు. అందరూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు డీఎస్పీ శ్రీనివాసులు సతీమణి సౌజన్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

➤ విజేతలకు బహుమతుల అందజేత

సంజామల: పేరుసోముల శ్రీవిద్య పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు సీఐ హనుమంత్ నాయక్, దాత శీల వెంకటేశ్వర్లు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణయ్య, ఎంఈఓ ఈశ్వరయ్య, నాయకులు బాలు యాదవ్, పాఠశాల డైరెక్టర్ మద్దిలేటి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాత

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

డోన్ రూరల్: మండల పరిధిలోని దేవరబండ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాలయానికి గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటస్వామి కుమారులు శంకర్, కె.రంగడు, కె.రమేష్ రూ.1,01, 116 విరాళం ఇచ్చారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో సీతారాముల ఆలయం నిర్మిస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమ వంతు సహాయం చేశామని తెలిపారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

డోన్ టౌన్/బేతంచెర్ల: సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడాన్ని నిరసిస్తూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరాం, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో విద్యుత్ బిల్లులు పెంచమని హామీలు ఇచ్చి నేడు సర్దుబాటు పేరుతో సామాన్యులపై భారం మోపారని విమర్శించారు. సీపీఎం నాయకులు అక్బర్‌బాషా, మమ్మద్‌రఫీ, సుంకన్న, దస్తగిరమ్మ పాల్గొన్నారు. అలాగే బేతంచెర్ల పాత బస్టాండ్‌లో సీపీఎం, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీల్లో తలపడుతున్న వృషభాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఆరుపళ్లలోపు ఎద్దులకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొత్తం 20 జతల ఎద్దులు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన ఎం.అక్షరరెడ్డి వృషభాలు విజేతగా నిలిచి రూ.35 వేలు కైవసం చేసుకున్నాయి. తరువాత స్థానాల్లో కర్నూలు జిల్లా తాండ్రపాడు గ్రామానికి చెందిన చిన్నరత్నం రూ.25 వేలు, గద్వాల జిల్లా ఇటుకల మండలానికి చెందిన అబ్దుల్ బాషా రూ.15 వేలు, అనంతపురం జిల్లా ఆత్మకూరుకు చెందిన గులి విశ్వనాథ్‌రెడ్డి రూ.10 వేలు, వైఎస్సార్ జిల్లా పాలమపల్లె గ్రామానికి చెందిన రాయల్‌రెడ్డి రూ. 8 వేలు, ప్యాపిలి మండలానికి చెందిన శేఖర్ రూ.5 వేలు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రన్నయాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

టవర్ నిర్మాణ పనుల అడ్డగింత

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీ సమీపంలో సోమవారం సెల్ టవర్ నిర్మాణ పనులను సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అడ్డుకున్నారు. కాలనీవాసుల విన్నపం మేరకు అక్కడికి వెళ్లి పనులు ఆపాలని కాంట్రాక్టర్‌తో వాదనకు దిగారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా టవర్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా నివాస ప్రాంతంలో టవర్ ఏర్పాటు చేయవద్దన్నారు.



కాంట్రాక్టర్‌తో వాదనకు దిగిన సీపీఐ నాయకులు

నిందితులను శిక్షించాలి

డోన్ టౌన్: మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను గుర్తించి శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం లీగల్ అడ్వయిజర్ జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి పోలీసులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 6వ తేదీ రాత్రి స్కూటీలో వెళుతున్న హరికిషన్‌ను కొందరు ఉద్దేశ పూర్వకంగా కారుతో వెనుక నుంచి ఢీకొని వెళ్లారని ఆరోపించారు. వారం అవుతున్నా నిందితులను గుర్తించలేదని తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలం చెల్లిన కల్వర్టులు

కొలిమిగుండ్ల: క్షణం తీరిక లేకుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై కాలం చెల్లిన కల్వర్టులు ఉండడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటు ప్రయాణం చేస్తున్నారు. కల్వర్టులు ఇరుకుగా మారి సైడ్‌వాల్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన వారం రోజులకే మామూలు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కల్వటాల-కొలిమిగుండ్ల మధ్యలో ఉన్న ధాఖా నాయక్‌పై బ్రిడ్జి పూర్తిగా దెబ్బతింది. నెల్లూరు-ముంబై ప్రధాన రహదారి కావడంతో వందల సంఖ్యలో ప్రజారవాణ, మట్టి, సిమెంట్, ఇతర ముడిసరుకులు రవాణా సాగించే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవలే మట్టి లారీ తెల్లవారుజామున బోల్తా పడడంతో ఐదు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాత్రి వేళల్లో ప్రయాణం చేసే వాహనదారుల పరిస్థితి దారుణంగా మారుతోంది. ఇప్పటికే చాలా సార్లు వాహనాలు ఢీకొనడంతో ఇరువైపులా సైడ్‌వాల్ కూలిపోయాయి. కల్వటాల ఊరి ముందున్న కల్వర్టు ప్రమాదకరంగా తయారైంది. అక్కడ సైడ్ వాల్ నిర్మించకపోవడంతో ఎప్పుడు ప్రమాదం పోటు చేసుకుంటుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు రెండు చోట్ల విశాలమైన బ్రిడ్జిలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న సైడ్‌వాల్



పడిపోయిన చోట తాత్కాలికంగా రాళ్లతో నిర్మిస్తున్న సైడ్‌వాల్

వైభవం.. శివపార్వతుల పల్లకోత్సవం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2009-10 బ్యాచ్‌కు చెందిన 42 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆద్యంతం ఉల్లాసంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియతిరిగి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పరం అడ్డపేర్లతో పిలుచుకుంటూ సరదాగా గడిపారు. నాడు ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబుద్ధుల కారణంగానే తాము ఈ స్థాయిలో ఉన్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. నాటి హెచ్ఎం ఆర్ఎల్ రంగయ్య, ఉపాధ్యాయులు మురళి, రమేష్, ఎడ్విన్‌పాల్, విశాలాక్షి, విశాల, సర్వజ్ఞ మూర్తి, సావిత్రి, పీఈటీ విష్ణువర్ధన్ తదితరులను ఘనంగా సన్మానించారు.